శివానీ పసిడి జోరు

సౌత్‌జోన్ అక్వాటిక్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెంగళూరు వేదికగా జరుగుతున్న సౌత్‌జోన్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ శివానీ కర్రా పసిడి పతక జోరు కనబరిచింది. శుక్రవారం జరిగిన బాలికల 100మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో బరిలోకి దిగిన శివానీ 1:12:88సెకన్ల టైమింగ్‌తో పసిడి పతకాన్ని దక్కించుకుంది. రితికా గోకుల్(కర్ణాటక), వేదశ్రీ(ఏపీ) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. అదే జోరు కనబరుస్తూ బాలికల 200 మీటర్ల మెడ్లే ఈవెంట్‌లో శివానీ 2:44:08సెకన్ల టైమింగ్‌తో మరో పసిడిని ఖాతాలో వేసుకుంది. ఇదే కేటగిరీలో పోటీకి దిగిన లాస్యశ్రీ(ఏపీ), సుమన్వి(కర్ణాటక) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉంటే బాలికల 400మీటర్ల ఫ్రీ స్టయిల్ ఈవెంట్‌లో శ్రీనిత్య 4:57:66సెకన్లతో స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. ఓవరాల్‌గా సౌత్‌జోన్ అక్వాటిక్ టోర్నీలో తెలంగాణ స్విమ్మర్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు.

దీక్షిత హ్యాట్రిక్

సత్తాచాటుతున్న కొమరవెల్లి సిస్టర్స్

తెలంగాణ సెయిలింగ్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హుసేన్‌సాగర్ వేదికగా జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో యువ సెయిలర్ కొమరవెల్లి దీక్షిత అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. బాలికల జూనియర్ విభాగంలో తన చెల్లెలు కొమరవెల్లి లాహిరిని వెనుకకు నెడుతూ దీక్షిత హ్యాట్రిక్ విజయాలతో టాప్‌లోకి వచ్చింది. హైదరాబాద్‌కు చెందిన ఈ ఇద్దరు సిస్టర్స్ ఏడు రేసుల తర్వాత 17 పాయింట్లతో సమంగా నిలిచారు. అయితే ఒక రేసు మినహాయించడంతో దీక్షిత పాయింట్ తేడాతో లాహిరిని అధిగమించించింది. శనివారం జరిగే రేసులో వీరిద్దరిలో విజేత ఎవరో తేలనుంది. పాలమూరుకు చెందిన బిందు రత్నావత్ కాంస్యాన్ని ఖాయం చేసుకుంది. బాలుర విభాగంలో వికారాబాద్‌కు చెందిన బన్నీ బొంగూరు నంబర్‌వన్‌లో ఉండగా, వినోద్ ఆ తర్వాత స్థానంలో ఉన్నాడు. శనివారం పోటీల ముగింపు కార్యక్రమం ఉంటుందని రాష్ట్ర సెయిలింగ్ అసోసియేషన్ పేర్కొంది.

వైష్ణవికి రజతం

ఫెడరేషన్ కప్ పవర్‌లిఫ్టింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇండోర్(మధ్యప్రదేశ్) వేదికగా జరిగిన ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ లిఫ్టర్లు వైష్ణవి, ఉదయ్‌కిరణ్ సత్తాచాటారు. శుక్రవారం జరిగిన మహిళల 84కిలోల విభాగంలో వైష్ణవి ఓవరాల్‌గా రజత పతకం దక్కించుకుంది. మరో వైపు పురుషుల 83కిలోల కేటగిరీలో ఉదయ్‌కుమార్ కాంస్య పతకం ఖాతాలో వేసుకున్నాడు.

తెలంగాణకు కాంస్యం

జాతీయ స్కూల్ గేమ్స్ టీటీ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: న్యూఢిల్లీ వేదికగా జరిగిన 67వ జాతీయ స్కూల్ గేమ్స్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అండర్-17 బాలుర టీమ్ కాంస్య పతకంతో మెరిసింది. శుక్రవారం జరిగిన బాలుర టీమ్ ఈవెంట్ సెమీఫైనల్లో తెలంగాణ 1-3 తేడాతో ఢిల్లీ చేతిలో ఓటమిపాలైంది. అయితే కాంస్య పతక పోరులో తెలంగాణ టీమ్ 3-1తో హర్యానాపై గెలిచి సత్తా చాటింది. వేర్వేరు గేముల్లో మన టీమ్ తరపున జతిన్‌దేవ్ 2-0తో రుషికేశ్‌పై, దేవాంశ్‌సింగ్ 2-1తో ధనంజయ్‌పై, జతిన్‌దేవ్ 2-0తో సార్తక్ ఆర్యపై గెలువగా, రిషబ్ 0-2తో సార్తక్ చేతిలో ఓటమిపాలయ్యాడు.

యోధాస్ ఓటమి

కటక్: అల్టిమేట్ ఖోఖో సీజన్-2లో తెలుగు యోధాస్‌కు రెండో ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో యోధాస్ 24-41 తేడాతో గుజరాత్ జెయింట్స్ చేతిలో ఓటమిపాలైంది. గుజరాత్ తరపున సాంకేత్ కదమ్ 12 పాయింట్లతో స్టార్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. సాంకేత్‌కు తోడు రాజ్యవర్ధన్, సుయాశ్, అభినందన్ పాటిల్ గుజరాత్ విజయంలో కీలకమయ్యారు.

అమ్మాయిలకు చావోరేవో

- నేడు భారత్, ఆస్ట్రేలియా రెండో వన్డే

ముంబై: టెస్టు ఫార్మాట్‌లో అదిరిపోయే ప్రదర్శన కనబర్చిన భారత మహిళల జట్టు.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ అదే జోరు కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి వన్డేలో ఆస్ట్రేలియా అమ్మాయిల చేతిలో పరాజయం పాలైన హర్మన్‌ప్రీత్ బృందం శనివారం రెండో వన్డేలో అమీతుమీ తేల్చుకోనుంది. ఇటీవల స్వదేశంలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాపై టెస్టు మ్యాచ్‌లు నెగ్గిన టీమ్‌ఇండియా.. కంగారూలపై వన్డే సిరీస్‌ను సైతం ఒడిసి పట్టాలని భావిస్తున్నది. ఇప్పటికే ఆసీస్ ఆధిక్యంలో నిలువగా.. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గితేనే హర్మన్ బృందం ఆశలు నెరవేరనున్నాయి. ఈ నేపథ్యంలో జట్టు సమిష్టిగా రాణించాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. గత మ్యాచ్‌లో బ్యాటర్లు రాణించి మంచి స్కోరు చేసినా.. బౌలర్లు పెద్దగా ప్రభావం చూపకపోవడంతో మన అమ్మాయిలకు పరాజయం తప్పలేదు. ఈ సారి ఆ లోపాలను సరిదిద్దుకొని సత్తాచాటాలని జట్టు చూస్తుంటే.. స్టార్లతో నిండిన ఆస్ట్రేలియా మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ కైవసం చేసుకోవాలని భావిస్తున్నది. హర్మన్‌ప్రీత్, షఫాలీ, జెమీమా, దీప్తి, స్నేహ్ రాణా, పూజ కలిసి కట్టుగా రాణించాల్సిన అవసరముంది.

సిరీస్ ఆసీస్‌దే

- రెండో టెస్టులోనూ పాక్ పరాజయం

మెల్‌బోర్న్: సొంతగడ్డపై ఆస్ట్రేలియా అదరగొట్టింది. వరుసగా రెండో టెస్టులోనూ పాకిస్థాన్‌ను చిత్తుచేసిన ఆసీస్.. మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. 317 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్ కంగారూ పేసర్ల ధాటికి 237 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ షాన్ మసూద్ (60), సల్మాన్ (50) అర్ధశతకాలు సాధించగా.. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (41), రిజ్వాన్ (35) కాస్త పోరాడారు. ఆసీస్ బౌలర్లలో కమిన్స్ 5, స్టార్క్ 4 వికెట్లు పడగొట్టారు. అంతకు ముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 318 పరుగులు చేయగా.. పాకిస్థాన్ 264 రన్స్‌కు పరిమితమైంది. కంగారూలు రెండో ఇన్నింగ్స్‌లో 262 పరుగులు చేసి ప్రత్యర్థి ముందు ఊరించే లక్ష్యాన్ని నిర్దేశించారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసిన కమిన్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

కొంతలోనే కోత

భారత జట్టుకు జరిమానా • రెండు డబ్ల్యూటీసీ పాయింట్లు తగ్గింపు

సఫారీ గడ్డపై టెస్టు సిరీస్ నెగ్గాలనే దృఢ సంకల్పంతో బరిలోకి దిగిన భారత జట్టు.. కనీస పోరాటం కనబర్చకుండా మూడు రోజుల్లోనే ప్రత్యర్థికి మ్యాచ్ అప్పగించేయగా.. ఈ ఓటమికి తోడు ఇప్పుడు మరో షాక్ తగిలింది. ఇంట్రా స్క్వాడ్‌కు బదులు ప్రాక్టీస్ మ్యాచ్‌లుఆడుంటే బాగుండేదని సీనియర్లు చురకలంటిస్తుంటే.. స్లో ఓవర్‌రేట్ కారణంగా రోహిత్‌సేనకు ఐసీసీ రెండు పాయింట్లు కోత పెట్టింది!

దుబాయ్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆకట్టుకోలేకపోయిన భారత జట్టుకు మరో దెబ్బ తగిలింది. సెంచూరియన్ పోరులో స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టీమ్ సభ్యుల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించింది. దీంతో పాటు రెండు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల కోత విధించింది. మనవాళ్లు ఏమాత్రం పోరాట పటిమ కనబర్చకపోవడంతో మూడు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్‌లో నిర్ణీత సమయానికి టీమ్‌ఇండియా రెండు ఓవర్లు తక్కువ వేసింది. దీంతో మ్యాచ్ రెఫరీ క్రిస్ బ్రాడ్ రెండు పాయింట్లు జరిమానా విధించాడు. 'భారత్ రెండు ఓవర్లు తక్కువ వేసింది. దీంతో ఆట గాళ్ల మ్యాచ్ ఫీజులో 10 శాతంతో పాటు డబ్ల్యూటీసీ రెండు పాయింట్లు కోత విధించాం' అని ఐసీసీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2023-25 డబ్ల్యూటీసీ సర్కిల్‌లో భారత్ ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడగా.. ఒక విజయం, ఒక ఓటమి, ఒక 'డ్రా'తో 38.89 ర్యాంకింగ్ పాయింట్లతో ఆరో స్థానానికి పడిపోయింది. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వరుసగా తొలి మూడు ప్లేస్‌ల్లో ఉన్నాయి.

జడేజా సాధన షురూ..

అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌తో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించగల ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా.. రెండో టెస్టు వరకు ఫిట్‌నెస్ సాధించేందుకు కసరత్తులు చేస్తున్నాడు. వెన్నునొప్పి కారణంగా తొలి మ్యాచ్‌కు దూరమైన జడేజా.. శుక్రవారం సాధన ప్రారంభించాడు. జడ్డూ గైర్హాజరీలో సఫారీల చేతిలో టీమ్‌ఇండియా ఓడటమే గాక.. స్లో ఓవర్ రేట్ కారణంగా రెండు డబ్ల్యూటీసీ పాయింట్లు కూడా కోల్పోయింది. క్షణాల్లో ఓవర్ ముగించగల జడేజా అందుబాటులో ఉంటే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

ఎల్గర్ సారథ్యంలో..

కెరీర్‌లో చివరి టెస్టు ఆడనున్న దక్షిణాఫ్రికా సీనియర్ ఆటగాడు డీన్ ఎల్గర్ ఈ మ్యాచ్‌లో సఫారీ జట్టుకు సారథిగా వ్యవహరించనున్నాడు. తొలి పోరులో గాయపడ్డ రెగ్యులర్ కెప్టెన్ టెంబా బవుమా స్థానంలో ఈ మ్యాచ్‌కు ఎల్గర్ నాయకత్వం వహించనున్నాడు.

అవేశ్ ఖాన్‌కు పిలుపు

గాయం కారణంగా దక్షిణాఫ్రికా పర్యటనకు దూరమైన సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ స్థానంలో అవేశ్‌ఖాన్ జట్టుకు ఎంపికయ్యాడు. పేస్‌కు అనుకూలించిన తొలి టెస్టులో టీమ్‌ఇండియా ఘోరపరాజయం మూటగట్టుకోగా.. ఇప్పుడు బోర్డు దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. రెండో టెస్టుకు ముందు అవేశ్ జట్టుతో చేరుతాడని ఒక ప్రకటనలో తెలిపింది. 'గాయపడ్డ షమీ స్థానంలో ఆల్‌ఇండియా సీనియర్ సెలెక్షన్ కమిటీ అవేశ్ ఖానును ఎంపిక చేసింది. వచ్చే నెల 3 నుంచి కేప్‌టౌన్ వేదికగా జరగనున్న రెండో టెస్టుకు అవేశ్ అందుబాటులో ఉంటాడు' అని బోర్డు పేర్కొంది.

యువతకు శుభవార్త

నమస్తే తెలంగాణ | Telangana Today

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారా?
ప్రామాణికమైన మెటీరియల్ కోసం ఎదురుచూస్తున్నారా?
ఏం చదవాలి?
ఎలా చదవాలి అని ఆలోచిస్తున్నారా?

నమస్తే తెలంగాణ నిపుణ
విద్యా, ఉద్యోగ వార్తల సమస్త సమాచారం

కొలువు.. సులువుగా గెలువు



పోటీపరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు నిపుణుల సలహాలు, ప్రామాణిక మెటీరియల్, ఏ పరీక్షకు ఎలా ప్రిపేర్ కావాలి, చదవాలి అనే అంశాలపై సీనియర్ ఫ్యాకల్టీల సలహాలు, సూచనలు. సక్సెస్ స్టోరీలతో నిపుణ మీ కోసం..

ప్రతీరోజు నాలుగు పేజీలు జిల్లా టాబ్లాయిడ్‌లో (తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో)
వారం వారం 8 పేజీల ప్రత్యేక అనుబంధంతో మీ ముందుకు...

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.